నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 31 మార్చి 2024 | HYDERABAD


## 63 లక్షల మొక్కలు నాటేలా..

మేడ్చల్, మార్చి30 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యే నాటికి నర్సరీలో మొక్కలను పెంచేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 73 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. వీటిని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నది. జిల్లా వ్యాప్తంగా వచ్చే హరితహారంలో 63 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యం పెట్టుకున్నారు. రహదారులు, పార్కులు, పట్టణ, పల్లె ప్రకృతి వనాలు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

## కాంగ్రెస్ వచ్చింది.. కరెంటు పోయింది..

బంజారాహిల్స్, మార్చి 30 : బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని మిథిలానగర్‌కాలనీలో హ్యాంగింగ్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్‌లో ప్రముఖ వ్యాపారవేత్త సర్ఫరాజ్ ఖాన్ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు పలు పార్టీల నేతలు హాజరయ్యారు. సరిగ్గా సాయంత్రం 6.45గంటలకు ఇఫ్తార్ ప్రారంభం కాగానే మూడు సార్లు కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో అక్కడున్న కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తదితరులు నవ్వులు చిందించారు. కాంగ్రెస్ వచ్చింది, కరెంటు పోయిందంటూ అక్కడున్న వారు జోక్స్ వేసుకోవడం కనిపించింది.

### యూపీఎస్సీ-సీఎస్ఏటీ పరీక్షకు
## ఉచిత శిక్షణ

ఏప్రిల్ 12 వరకు దరఖాస్తుకు అవకాశం

సిటీబ్యూరో, మార్చి 30 ( నమస్తే తెలంగాణ ) : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ-సీఎస్ఏటీ పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కల్పించిన దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్నీ రిజర్వ్ కేటగిరీలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయిస్తామని చెప్పారు. దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ ఏప్రిల్ 12 అని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష ఏప్రిల్ 28న ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 040-23240134 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## ఐపీఎల్ టికెట్లంటూ..




సిటీబ్యూరో: ఐపీఎల్ సీజన్ కొనసాగుతుండటంతో సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసేందుకు రంగంలోకి దిగుతున్నారు. ఇటీవల హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఘన విజయం సాధించడంతో వచ్చే నెల 5న జరిగే మరో మ్యాచ్‌కు భారీ డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఆన్‌లైన్‌లో ఐపీఎల్ టికెట్లంటూ ప్రకటనలు ఇస్తున్నారు. వీటిని క్లిక్ చేయగానే వెబ్‌సైట్లలోకి వెళ్తాయి.. అక్కడ ఆన్‌లైన్ పేమెంట్స్ తీసుకున్నాక.. నకిలీ టికెట్లు విక్రయించేందుకు ఎత్తులు వేస్తున్నారు. అలాగే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్లు పొందవచ్చంటూ ప్రకటనలు ఇస్తున్నారు. ఇలాంటి ప్రకటనలు చూసి ప్రజలు మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

### నేడు ఆర్ట్స్ కాలేజీలో
## ఈస్టర్ రైడ్

సిటీబ్యూరో, మార్చి 30 ( నమస్తే తెలంగాణ ) : ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో 'ఈస్టర్ రైడ్' నిర్వహిస్తామని సంస్థ ఫౌండర్ నందనూరి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైక్లిస్టులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. సైక్లింగ్ ప్రోత్సహించడమే లక్ష్యంగా రైడ్స్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

### ఓల్డ్‌సిటీలో
## ట్రాఫిక్ ఆంక్షలు



సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): హజ్రత్ అలీ వర్ధంతి సందర్భంగా నేడు ఓల్డ్‌సిటీలో ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో చార్మినార్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు, మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 4.30 గంటల నుంచి 7 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ తెలిపారు. నిర్ణీత సమయాల్లో వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని సూచించారు.

### నేడు
## 'ది హైదరాబాద్ రన్'

ఖైరతాబాద్, మార్చి 30 : పేద విద్యార్థులకు సహకారం అందించాలన్న సంకల్పంతో స్ట్రీట్‌కాస్, పల్లవి ఫౌండేషన్, మై ఫిట్‌నెస్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నేడు నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఉదయం 5.30 గంటలకు ఆర్ఎఫ్‌సీ 10 పేరుతో ది హైదరాబాద్ రన్ నిర్వహిస్తున్నట్లు స్ట్రీట్‌కాస్ సీఈవో శృతి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రన్‌కు సంబంధించిన బ్రోచర్లను సంస్థ అధ్యక్షురాలు సాహితీ, పల్లవి ఫౌండేషన్ సీఈవో యశస్వి, మై ఫిట్‌నెస్ సంస్థ తెలంగాణ ఏపీ సేల్స్ మేనేజర్ కల్యాణ్, మేనేజర్ ధనుశ్రీతో కలిసి ఆవిష్కరించారు. శృతి మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా విద్యార్థుల చదువులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం కృషి చేస్తున్నామన్నారు. ఏడు నగరాల్లో స్ట్రీట్ కాస్ విస్తరించిందని, 2030 నాటికి 30 నగరాల్లో విస్తరించాలన్నది తమ లక్ష్యమన్నారు. ఆదివారం 5కే రన్‌తో పాటు బ్యాండ్, జుంబా, స్టాండప్ కామెడీ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని వెల్లడించారు.

# భానుడు భగభగ

### రోజుకు ఒక డిగ్రీ సెల్సియస్ చొప్పున పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**పైకి ఎగబాకుతున్న విద్యుత్ వినియోగం**

**గ్రేటర్‌లో తొలిసారిగా శుక్రవారం 81.39 ఎంయూలుగా నమోదు**

**ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో శివారు ప్రాంతాల్లో విస్తరించని విద్యుత్ నెట్‌వర్క్**

**భూగర్భ జలాలు లేక జలమండలి సరఫరాపై తీవ్ర ఒత్తిడి**




సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 30 (నమస్తే తెలంగాణ): భానుడు బెంబేలెత్తిస్తున్నాడు. ఎండ సుర్రుమంటున్నది. నాలుగు రోజులుగా రోజురోజుకీ పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతుండటంతో పాటు రాత్రివేళ ఉక్కపోత కూడా నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఈ నేపథ్యంలో కరెంటు వినియోగం కూడా నానాటికీ పైకి ఎగబాకుతున్నది. రెండు, మూడు రోజులుగా గ్రేటర్ చరిత్రలోనే గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదవుతూ వస్తున్నది. దీనికి తోడు భూగర్భజలాలు ఇప్పటికే పాతాళానికి పడిపోవడంతో జలమండలి నీటి సరఫరాపైనే నగర జీవనం సాగుతున్నది. డిమాండుకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో చాలాచోట్ల జనం ఇబ్బందులు పడుతున్నారు. జలమండలికి ఉన్న వ్యవస్థతో పూర్తి సామర్థ్యం మేర సరఫరా చేస్తుండగా... ముున్ముందు నీటి వినియోగం మరింత పెరిగితే పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

### ఆరంభంలోనే ఠారెత్తిస్తున్నాయి..

ఆరంభంలోనే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. కేవలం పదిరోజుల వ్యవధిలోనే పగటి ఉష్ణోగ్రతలు దాదాపు పది డిగ్రీల సెల్సియస్ మేర పెరిగాయి. రోజుకు ఒక డిగ్రీ సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇదే నెల 20న 32.3 డిగ్రీల సెల్సియస్‌గా ఉన్న పగటి ఉష్ణోగ్రత 30వ తేదీ నాటికి సుమారు 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదైంది. దీంతో జనం ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా గత మూడు, నాలుగు రోజులుగానైతే ఉష్ణోగ్రతల్లో పెరుగుదల మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే క్రమంలో రాత్రి ఉష్ణోగ్రతల్లో కూడా పెరుగుదల నమోదవుతుండటంతో రాత్రివేళ ఉక్కపోతతో జనం అవస్థలు పడుతున్నారు. శనివారం నుంచి కొంతమేర వడగాడ్పులు కూడా మొదలయ్యాయి. ఇవి మరింత తీవ్రమైతే జనం మరింత ఇబ్బందిపడే ప్రమాదముంది.

**రికార్డులు నమోదు...**

ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం కూడా నానాటికీ పెరుగుతున్నది. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రికార్డు స్థాయిలో వినియోగం నమోదవుతున్నది. నాలుగైదు రోజుల కిందట మే నెలలో నమోదయ్యే వినియోగం స్థాయికి చేరుకున్న విద్యుత్ డిమాండు.. ఇప్పుడు అంతకుమించి అన్నట్లు పైకి ఎగబాకుతున్నది. ఈ నెల 28న 79.48 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం... శుక్రవారం ఏకంగా 81.39 మిలియన్ యూనిట్లకు చేరుకొని... తొలిసారిగా 80 మిలియన్ యూనిట్ల మార్కును దాటేసింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కూడా శనివారం విద్యుత్‌పై సమీక్ష నిర్వహించారు. అయితే ఎల్‌సీల మాటున కొందరు ఉద్దేశపూర్వకంగా కరెంటు కోతలు విధిస్తున్నారంటూ ప్రభుత్వం ఎల్‌సీల అనుమతిని నిలిపివేసింది. దీంతో శివారు ప్రాంతాల్లో కొత్త లైన్ల ఏర్పాటు అనేది సమస్యగా మారింది. శివారు ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు దాదాపుగా నిలిచిపోయింది. అక్కడ జనం అవస్థలు పడుతున్నారు. వారికి కరెంటు సరఫరా ఇవ్వాలంటే ఫీడర్ మొత్తం ఎల్‌సీ తీసుకోవాల్సిన పరిస్థితి. దీంతో విడవమంటే పాముకు... కరవమంటే కప్పకు అన్నట్లుగా అధికారుల పరిస్థితి తయారైంది. వడగాడ్పులు తోడైతే ఉష్ణోగ్రతలు మరింత పెరిగి కరెంటు వినియోగం ఇంకా పెరిగే అవకాశాలున్నా.. విద్యుత్ వ్యవస్థ విస్తరణ అనేది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.


| తేదీ | గరిష్ఠ | కనిష్ఠం |
|---|---|---|
| 29 | 40.2 | 25.4 |
| 28 | 39.2 | 24.6 |
| 27 | 37.6 | 24.2 |
| 26 | 38.2 | 24.5 |
| 25 | 37.0 | 26.6 |
| 24 | 37.3 | 26.7 |
| 23 | 37.5 | 23.6 |
| 22 | 36.7 | 22.4 |
| 21 | 34.6 | 22.4 |
| 20 | 32.3 | 22.4 |

### కత్తి మీద సాములా నగర నీటి సరఫరా...

నగరంలో జలమండలి నీటి సరఫరా అనేది కత్తి మీద సాములా మారుతున్నది. వాస్తవానికి జలమండలి వివిధ నీటి వనరుల ద్వారా సరఫరా చేసే నీటి పరిమాణం ఇంతకంటే పెరిగే అవకాశాలు ఏమాత్రం కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు సామర్థ్యం పెంపు అనేది కూడా సాంకేతికంగా సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో సరఫరా సామర్థ్యం ఇదేవిధంగా కొనసాగించడమనేది కూడా ఒక సవాల్‌గానే ఉన్నది. ముఖ్యంగా ఎల్లంపల్లి జలాశయంలో నీటి నిల్వ అనేది ఆందోళనకరంగానే ఉన్నది. అయితే నగరంలో ఇప్పటికే బోర్లు ఎండిపోయిన నేపథ్యంలో జలమండలి సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్నది. శివారు ప్రాంతాల్లో ప్రైవేటు ట్యాంకర్లు ఇప్పటికీ ఓ మోస్తరుగా జనాన్ని ఆదుకుంటున్నాయి. కానీ ఆ బోర్లు కూడా ఒట్టిపోయినట్లయితే పరిస్థితి మరింత జఠిలంగా మారుతుంది.

**నాలుగు రోజుల్లో విద్యుత్ వినియోగం ఇలా... (మిలియన్ యూనిట్లు)**

| | |
|---|---|
| 26.03.2024 | -75.73 |
| 27.03.2024 | -77.63 |
| 28.03.2024 | -79.48 |
| 29.03.2024 | -81.39 |





సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, గాంధీ, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

## కాసాని..బీసీ గొంతుక

### పార్లమెంటుకు పంపుదాం : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మియాపూర్ , మార్చి 30: సీఎం కేసీఆర్ పాలనలో విశేష ప్రగతితో నియోజకవర్గాలన్నీ పురోగతిని సాధించాయని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీలను ఏమాత్రం అమలు చేయడం లేదని, కేవలం బీఆర్ఎస్‌ను బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నదన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం శనివారం మియాపూర్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో జరిగింది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్ సుదీర్ఘ అనుభవం ఉన్న రాజకీయ నాయకుడని.. బీసీ గొంతుకను అధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలని కోరారు. అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ గడచిన రెండు పర్యాయాలు చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగిరిందని, ప్రజల మద్దతుతో హ్యాట్రిక్‌ను సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### మల్కాజిగిరిలో
## గులాబీ జెండా ఎగరాలి

### ఎన్నికల ప్రచారంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



గాజులరామారంలోని ఆక్సిజన్ పార్కులో వాకర్స్, చిన్నారులను పలుకరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

దుండిగల్, మార్చి30: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ (125) ఆక్సిజన్ పార్క్, ఉషోదయ కాలనీలో శనివారం రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయరాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### అంబర్‌పేటలో నేడు కేటీఆర్ పర్యటన

గోల్నాక: అంబర్‌పేటలో నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటిస్తారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ నుంచి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరవుతున్నట్లు వివరించారు.



### మూసీ పొడవునా..
## రీటెయినింగ్ వాల్

**డీపీఆర్ రూపకల్పనకు కన్సల్టెంట్లకు బాధ్యతలు**

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జంట జలాశయాలైన గండిపేట (ఉస్మాన్‌సాగర్), హిమాయత్‌సాగర్‌ల కింద నుంచి ప్రారంభమయ్యే మూసీ, ఈసా నదుల తీర ప్రాంతాన్ని పరిరక్షిస్తూ చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా రిటైయినింగ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. హైదరాబాద్ మహానగరానికి ఒక చివర నుంచి మరో చివరి వరకు పారుతున్న మూసీ నదికి ఇరువైపులా రీటైయినింగ్ వాల్ నిర్మిస్తే..భవిష్యత్‌లో కబ్జాలను అడ్డుకోవడంతో పాటు మూసీ నదిలో వచ్చే వరద బయటకు రాకుండా ఉంటుంది. ఇందులో భాగంగానే నగరానికి పడమర దిక్కున ఉన్న గండిపేట, హిమాయత్‌సాగర్ కింది భాగాల నుంచి మొదలు కొని తూర్పు వైపు ఉన్న గౌరెల్లి ఔటర్ రింగు రోడ్డు వరకు సుమారు 55 కి.మీ మేర మూసీ నది వెంబడి అవసరమైన చోట రీటెయినింగ్ వాల్ నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) రూపొందించే పనులను కన్సల్టెంట్‌లకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అప్పగించింది. దీని రూపకల్పన చేసే సంస్థలకు ఈ రంగంలో అనుభవం ఉన్న వారిని ఎంపిక చేసి, బాధ్యతలు అప్పగించనున్నది. ఎంపిక బాధ్యతను ప్రభుత్వం తరపున ఏర్పాటైన ఎంఆర్‌డీసీఎల్ అధికారులు చేపట్టారు. 15 ఏండ్లలో నదులు, ఉపనదులు, ప్రవాహాలు, కాలువలు, బ్యారేజీలు ఉన్న ప్రాజెక్టుల్లో భాగంగా రిటెయినింగ్ వాల్స్ నిర్మాణం కోసం రూపొందించిన డీపీఆర్‌లను విజయవంతంగా పూర్తి చేసిన అనుభవం ఉన్న వారినే ఎంపిక చేయనున్నారు.

# కంపుకొడుతున్న హుస్సేన్‌సాగర్

**దూరమవుతున్న పర్యాటకులు**

**మురుగునీటి శుద్ధిని మరిచిన హెచ్ఎండీఏ**



సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): లుంబినీ పార్కు... ఎన్టీఆర్ గార్డెన్... ట్యాంక్‌బండ్...సంజీవయ్య పార్కు... నెక్లెస్ రోడ్డు... జల విహార్... పీపుల్స్ ప్లాజా... ఇలా హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న పలు ప్రాంతాలు నిత్యం సందర్శకులతో సందడిగా ఉంటాయి. నగరవాసులకే కాకుండా దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు సాగర్ అందాలను ఆస్వాదిస్తుంటారు. అలాంటి హుస్సేన్‌సాగర్‌లోని జలాలు మురుగునీటితో కలుషితం కాకుండా, దుర్వాసన రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాల్సిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా సాగర్ తీరంలో ఎక్కడికి వెళ్లినా దుర్గంధంతో కూడిన వాసన గుప్పుమంటూ వస్తోంది. దీంతో ఆచుట్టు పక్కల ప్రాంతాల్లో కొద్ది సేపైనా సేద తీరే పరిస్థితి లేకుండా పోయింది. ముఖ్యంగా వేసవి కాలం వచ్చిందంటే చాలు హుస్సేన్‌సాగర్ తీరంలో ఎక్కడికి వెళ్లినా దుర్వాసన రావడం, దాన్ని అరికట్టేందుకు హెచ్ఎండీఏ అధికారులు చర్యలు తీసుకోవడం వంటివి చేస్తుంటారు. అయితే ఈసారి ఫిబ్రవరి నుంచే ఎండలు మొదలై, మార్చిలోనే 40 డిగ్రీలు దాటుతున్న పరిస్థితి. దీంతో ఎండల తీవ్రతకు హుస్సేన్‌సాగర్‌లోని మురుగునీరు ఎక్కడికక్కడ పేరుకుపోయి తీవ్రమైన స్థాయిలో దుర్వాసన వస్తోందని పర్యాటకులు వాపోతున్నారు. కుటుంబంతో కలిసి సాయంత్రం వేళ సరదాగా సాగర తీరానికి వచ్చే వారు దుర్గంధంతో కూడిన వాసనను భరించలేకుండా పోతున్నామని అంటున్నారు.

### హెచ్ఎండీఏ నిర్లక్ష్యం....

హుస్సేన్‌సాగర్‌లోకి మురికి నీరు రాకుండా ఆపడం సాధ్యం కాదు. అయితే వచ్చే నీటిని శుద్ధి చేసి వ్యర్థాలను తీసివేస్తే కొంత వరకు ఆ ప్రయత్నంలో విజయం సాధించినట్లే. మురుగునీటి లేని సాగర్‌ను చూడాలని, దుర్వాసన లేని సాగర్ పరిసరాల్లో విహరించాలని సగటు హైదరాబాదీ కల. ఏటా ప్రభుత్వాలు ఇందుకోసం చేస్తున్న ప్రయత్నాలు మొక్కుబడిగా ఉంటున్నాయే తప్ప, శాశ్వత దిశగా చర్యలు ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. ఏటా సాగర్ శుద్ధి కోసం కోట్లాది రూపాయలను హెచ్ఎండీఏ వెచ్చిస్తున్నది. అయినా వేసవి వచ్చేసరికి అదే సమస్య పునరావృతమవుతున్నది. హుస్సేన్‌సాగర్‌ను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను చేపట్టిన హెచ్ఎండీఏ.. ఆ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. నగరం నడిబొడ్డున పర్యాటక కేంద్రంగా ఉన్న హుస్సేన్‌సాగర్ పరిశుభ్రతపై ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు ముందు చూపుతో వ్యవహరించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### ఆలస్యంగా మేల్కొన్న అధికారులు...

హుస్సేన్‌సాగర్‌లోకి వచ్చే చేరే మురుగునీటికి చెక్ పెట్టేందుకు హెచ్ఎండీఏ చాలా ఆలస్యంగా చర్యలు చేపట్టింది. ఈనెల మొదటి వారంలో హుస్సేన్‌సాగర్ శుద్ధి, నిర్వహణకు సంబంధించిన ప్రత్యేకంగా టెండర్లను ఆహ్వానించింది. ఇందుకోసం మొత్తం రూ.రూ.7.19 కోట్లను వెచ్చిస్తున్నామని పేర్కొంది. ఇందులో భాగంగా మూడు చోట్ల ఉన్న ఎస్టీపీలతో పాటు మొత్తం 7 చోట్ల ఉన్న ఐ అండ్ డీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ఇప్పటికీ ఆ పనులు క్షేత్ర స్థాయిలో మొదలుకాకపోవడంతో ప్రస్తుతం ఎండల తీవ్రతకు సాగర్ తీర ప్రాంతంలో ఎక్కడ నిల్చున్నా దుర్గంధం వెలువడుతోంది. దీంతో నిత్యం వేలాదిగా వచ్చే పర్యాటకులు సాగర్ వైపు రావాలంటేనే ముక్కు మూసుకొని ఉండాల్సి వస్తోందంటున్నారు.ఇప్పటికైనా హెచ్ఎండీఏ అధికారులు యుద్ధ ప్రాతిపదికన హుస్సేన్ సాగర్ తీర ప్రాంతాల్లో దుర్వాసన వస్తున్న చోట చర్యలు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

### ఎన్నికల నిర్వహణను
## తేలికగా తీసుకోవద్దు

**మాస్టర్ ట్రైనర్స్ శిక్షణలో కమిషనర్ రోనాల్డ్ రాస్**



సిటీబ్యూరో, మార్చి 30 ( నమస్తే తెలంగాణ ) : ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో నిర్వర్తించినప్పుడే ఎలాంటి పొరపాట్లు జరగవని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. బంజారాభవన్‌లో శనివారం సెక్టర్ ఆఫీసర్లు, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోనాల్డ్ రాస్ మాట్లాడుతూ.. మాక్ పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పీవో, ఏఈపీవోలకు అన్ని విషయాలపై ఎఎల్‌టీఎంలు స్పష్టంగా అవగాహన కల్పించాలని చెప్పారు. గతంలో పని చేశాం కదా.. అని ఎవ్వరూ కూడా తేలికగా తీసుకోవద్దన్నారు. పోలింగ్ బూత్ లోపల.. బయట సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 నింపి ఇవ్వాలని సూచించారు. మే 3 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు జిల్లాలో 15 నియోజకవర్గాల్లో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు వేసేలా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదన్నారు. పోలింగ్ నిర్వహించే సిబ్బందికి ఏప్రిల్ 1, 2న ఏఆర్వో స్థాయిలో శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి తప్పిదాలు జరిగినా.. ఎన్నికల కమిషన్ చేపట్టే చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.